'తల్లీబిడ్డ' సంరక్షణకు అండ!

- ఆదుకుంటున్న డా.వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు
- డివిజన్ పరిధిలో సేవలందిస్తున్న 25 వాహనాలు
- పదిహేను నెలల్లో 6,207 మందికి ఎక్స్‌ప్రెస్ సేవలు
- పైసా ఖర్చు లేకుండా ఉచితంగా సురక్షితంగా చేరుతున్న వైనం
- వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు



ప్రభుత్వ వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలు



డిశ్చార్జ్ అయిన తల్లీబిడ్డలు సురక్షితంగా వాహనంలో వెళ్తున్న దృశ్యం (ఫైల్)

ఆదోనిఅర్బన్ : వైద్య రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. గ్రామీణులకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పెనుమార్పులు తీసుకొచ్చింది. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మార్చేసిన సర్కార్ మౌలిక వసతులు కల్పించిన విషయం తెలిసిందే. ఇక ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అందరి మన్ననలు పొందుతుంది కూడా. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన డా.వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (104) మహిళల పాలిట వరంగా మారాయి. 108 అంబులెన్స్‌తోపాటు డా.వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలపై సర్వత్రా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పురిటినొప్పులు రాగానే 108 అంబులెన్స్‌కు సమాచారం వచ్చిందంటే చాలు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చుతున్నారు. అనంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో ఇంటికి చేర్చుతున్నారు. దీంతో సర్వత్రా తల్లిబిడ్డలు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుంది. గర్భిణులను ఆస్పత్రికి ప్రసవం కోసం చేర్చడానికి 108 అంబులెన్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రసవం తర్వాత తల్లీబిడ్డలను ఇంటికి సురక్షితంగా చేర్చడానికి డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్‌ల ద్వారా ఉచితంగా చేరుస్తున్నారు. గర్భిణులను ఆస్పత్రికి ఉచితంగా తీసుకెళ్లడంతో పాటు ప్రసవం అనంతరం డిశ్చార్జ్ అయిన బాలింతలను ఇంటికి కూడా ఉచితంగా ఈ వాహనం ద్వారా ప్రభుత్వమే చేర్చుతుంది. ఏసీ సౌకర్యంతో కూడిన వాహనం కావడంతో తల్లీబిడ్డకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రతి ఒక్కరు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు.

డివిజన్ పరిధిలో 25 వాహనాలు

జిల్లాలో 64 డా.వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉండగా, ఆదోని డివిజన్ పరిధిలో 25 వాహనాలు సేవలందిస్తున్నాయి. ఆదోనిలో 07, ఎమ్మిగనూరు 05, పెద్దతుంబళంలో 03, కౌతాళంలో 01, హొళగుందలో 01, ఆస్పరి–01, చిప్పగిరి–01, ఆలూరు–01, పెద్దకడబూరు–01, కోసిగిలో 03 చొప్పున డా.వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు సేవలందిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు వరకు 6,207 మంది డిశ్చార్జ్ అయిన బాలింతలను ఈ వాహనాల్లో ఉచితంగా, సురక్షితంగా ఇంటికి చేర్చారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ యేడాది ఏప్రిల్ వరకు 4970 మంది బాలింతలను ఇంటికి చేర్పించగా, ఈ యేడాది మేలో 393, జూన్‌లో 300, జూలైలో 355, ఆగస్టులో 180 మందిని బాలింతలను వారి ఇళ్లకు సురక్షితంగా చేర్చాయి డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు.

– యాప్‌లో గర్భిణుల వివరాలు

గర్భిణులు కాన్పు కోసం ఆస్పత్రికి వెళ్లిన నాటి నుంచి డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో నమోదు చేస్తారు. తల్లుల రక్షణ, భద్రతకు భరోసా కల్పిస్తూ వాహనాలకు జీపీఎస్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేస్తూ వాహనం ఎక్కడ ఉందో కూడా అధికారులు యాప్ ద్వారా తెలుసుకునేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలకు టోల్‌ఫ్రీ నంబర్ 102 కేటాయించారు.

108 అంబులెన్స్‌లోనే కాన్పు అయ్యింది



నా కోడలు ఫిర్దోస్‌కు పురిటినొప్పులు రావడంతో వెంటనే 108కు సమాచారం అందించాం. ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రసవం అయ్యింది. అయినా వెంటనే అంబులెన్స్ సిబ్బంది మాతాశిశు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు, సిబ్బంది బాగా చూసుకున్నారు. ఐదు రోజుల పాటు వైద్యసేవలు అందజేసి డిశ్చార్జ్ చేశారు. డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనంలో తల్లీబిడ్డలను ఉచితంగా ఎమ్మిగనూరులోని తమ ఇంటికి సురక్షితంగా చేర్పించారు. తమకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. ఎటువంటి రవాణా చార్జీలు లేకుండా ఇంటికీ చేరుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– హసీనా, ఎమ్మిగనూరువాసి

ఉచితంగా ఇళ్లకు చేర్చుతున్నాం



ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో ఏడు వాహనాలు ఉన్నాయి. ప్రతిరోజూ 15 నుంచి 22 మంది వరకు డిశ్చార్జ్ అయిన బాలింతలను వెంటనే డా.వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనంలో సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నాం. వంద కి.మీ.ల వరకు సర్వీసు పరిధి ఉంటుంది. వంద కి.మీ. దాటి వెళ్లాలంటే అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు కర్ణాటకలోని బళ్లారి, సిరుగుప్ప వరకు తల్లీబిడ్డలను వదిలిపెట్టి వచ్చాం. బాలింతలు, వారి కుటుంబ సభ్యులు పడుతున్న సంతోషం తమకు ఎంతో తృప్తినిస్తుంది.

– గురుప్రసాద్, తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనం సీనియర్ డ్రైవర్

క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ అవయవదాన దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

ఆదోనిఅర్బన్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆవరణలో ప్రజలకు అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్, లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్లు గోపీనాథ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు డాక్టర్ క్రిష్ణమూర్తి, డాక్టర్ హరీష్, డాక్టర్ అనూష మాట్లాడారు. ఏ అవయవాలు పనికొస్తాయో, దానం చేసేవారు ఎలా ఉండాలన్న విషయాలను వివరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, రీజియన్ చైర్మన్ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయజెండాలు అందజేత

ఆదోనిఅర్బన్: ఈనెల 13వ తేదీ నుంచి స్వాతంత్ర్య దినోత్సవం 15వ తేదీ వరకు భారత పౌరుడు వారి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేందుకు ఆదివారం బీజేవైఎం నాయకులకు జాతీయ జెండాలను అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్ సహకారంతో 50 జాతీయ జెండాలను ఇచ్చారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

ఆదోనిఅర్బన్: బీజేవైఎం రాష్ట్రశాఖ పిలుపు మేరకు భారతీయ జనతా యువమోర్చ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మిగనూరు సర్కిల్ నుంచి నిర్మల్ టాకీస్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా కోట్ల కూడలివరకు యాత్ర సాగింది. ఈ ర్యాలీలో భరతమాతకు జై హింద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస ఆచారి మాట్లాడుతూ త్రివర్ణ పతాకాన్ని ఆగస్టు 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి పౌరుడూ వారివారి ఇంటి మీద ఎగరవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, మహాదేవ్, అజయ్‌కుమార్, మోహన్, లక్ష్మణ్, రాజీవ్, వివేక్, రఘునాథ్, సర్వాన్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానికి విరాళం



దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి ఆదివారం బళ్లారి చెందిన అనుపమ రూ. 43 వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్ప స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో కార్డెన్ సెర్చ్



ఇళ్లల్లో సోదాలు చేస్తున్న పోలీసులు

ఆదోనిఅర్బన్ : డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఆదోని త్రీటౌన్ సీఐ, ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుంజ్యోతినగర్, కార్వన్‌పేట, కౌడల్‌పేట ప్రాంతాల్లో సోదాలు చేశారు. 20 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 20 బస్తాల పీడీఎస్ రైస్(50కేజీలు) ప్యాకెట్లు, 13 రికార్డులు సరిగా లేని మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దాడుల్లో త్రీటౌన్ సీఐ నరసింహరాజు, ఎస్‌ఐలు జయశేఖర్, విజయలక్ష్మి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని వగరూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరిస్తున్నట్లు జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు చిక్కం జానయ్య తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టెపోగు బసవరాజు రానున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ఆదోని సెంట్రల్: ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల పదోన్నతులు పొందిన వారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అలిమ్ సిద్ది కి అధ్యక్షతన ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంఘం అధ్యక్షుడు ఏపీ రెడ్డి ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ రావు, కర్నూలు జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్,పుల్లన్న, మహేంద్ర, నంద్యాల జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఆదోని జోన్ అధ్యక్ష, కార్యదర్శులు అంజినమ్మ, ముజహిద్ నాగరాజు, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాండవగల్ వార్డుమెంబర్ ఏకగ్రీవం

ఆదోనిరూరల్: మండలంలోనిపాండవగల్ గ్రామం రెండవ వార్డు మెంబర్ తుంబలం మూకయ్య 2022 నవంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. రెండవ వార్డుకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. సీపీఎం తరపున తుంబలం మూకయ్య కుమారుడు తుంబలం వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేశారు. తండ్రి మరణాంతరం జరుగుతున్న ఎన్నిక కావడంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలు అభ్యర్థులను నిలబెట్టలేదు. దీంతో తుంబళం వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, మండల నాయకులు రామాంజనేయులు, పాండురంగ, అనీఫ్, గోవిందు తదితరులు వెంకటేశ్వర్లను అభినందించారు.

పకడ్బందీగా ఓటర్ సర్వే చేయాలి



మేదర్‌గేరిలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ఓటర్ల జాబితాను పకడ్బందీగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి వార్డు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని వడ్డేగేరి, భీరప్పనగర్, మేదర్‌గేరిలో జరుగుతున్న సర్వేను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ, కొత్తగా ఓటర్ నమోదు, చనిపోయిన ఓటర్ల తొలగింపు, ఓటర్ కార్డు పరిశీలన తదితర అంశాలపై పక్కాగా వివరిస్తూ సర్వేను పూర్తి చేయాలన్నారు. ఓటర్ సర్వేలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మారుమోగిన హరినామస్మరణం



కీర్తనలు ఆలపిస్తున్న భజన భక్తులు



భజనలో పాల్గొన్న దాస సాహిత్య మండలి మహిళలు

మంత్రాలయం : హరి, గోవర్ధనుడి నామ స్మరణతో వేద భూమి మారుమోగింది. ఆదివారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో గురు సార్వభౌమ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంకీర్తనాలపన గావించారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆశీస్సులతో ఊంజల మంటపం వేదికగా హరికీర్తనలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 500 మంది భజన మండలి మహిళలచే కార్యక్రమం నిర్వహించారు. గేయాలపనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దైవ చింతనకు ఇలాంటి భజనలు దోహద పడతాయని ఈ సందర్భంగా పీఠాధిపతి స్పష్టం చేశారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలను ఇనుమడింపజేసేందుకు శ్రీమఠం తరపున విశేష కృషి చేస్తున్నట్లు వ్యక్తం చేశారు. వేడుకలో ఏఏవో మాధవశెట్టి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, సంస్కృత విద్యాపీఠం ప్రధానాచార్యులు వాదీరాజాచార్, ప్రాజెక్టు సభ్యులు ప్రాణేష్, భజన మండలి హరిదాసులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు సందేశమిచ్చారు. హిందూ ధర్మం గొప్పదని, కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

హెచ్ఎం కృష్ణమూర్తి అక్రమాలపై విచారణ చేయాలి

కోసిగి: కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిన హెచ్ఎం కృష్ణమూర్తి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోసిగి మండల మాజీ కోఆప్షన్ మెంబర్ షంషుద్దీన్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన నంద్యాల జిల్లా డిప్యూటీ డీఈఓ మహమ్మద్ బేగ్ చేసిన విచారణలో లోపాలు ఉన్నాయన్నారు. కేవలం హెచ్ఎం కృష్ణమూర్తిని సేవ్ చేయడానికి విచారణ జరిగినట్లు అనిపిస్తోందని ఆరోపించారు. గతంలో ఆయన పనిచేసే టప్పుడు మధ్యాహ్న భోజన పథకంలో కేటాయించిన రేషన్ బియ్యంలో అవినీతికి పాల్పడడం జరిగిందన్నారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ఆయనపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఆర్‌జేడీకి లెటర్ ద్వారా విన్నవించామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో పొలానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి భీమేష్‌కు గాయాలయ్యాయి. వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మంత్రాలయానికి చెందిన సురేష్, రాజేశ్వరి దంపతుల కుమారుడు భీమేష్ కోసిగి మండలం సజ్జలగుడ్డం గ్రామంలో అవ్వతాతలు భీమక్క, మల్లయ్య వద్ద ఉంటూ జంపాపురం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై పొలానికి వెళ్తుండగా అదుపు తప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. విద్యార్థిని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108 వాహనంలో ఈఎంటీ రామకృష్ణ, పైలట్ జగదీష్ ఆదోని ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

- బృందావన దర్శనానికి గంటన్నర సమయం
- రూ.2.50 లక్షల విరాళాలు



శ్రీమఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం : ప్రసిద్ధ మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో వేలాదిగా భక్తులు మంత్రాలయం విచ్చేశారు. మూడువేలకు పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు అంచనా. రాఘవేంద్రుల మూల బృందావన దర్శనానికి గంటన్నరకుపైగా సమయం పట్టింది. తుంగభద్ర నదీతీరం, అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం, మంచాలమ్మ దర్శన క్యూలైన్లు కిక్కిరిశాయి. బెంగళూరు, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి అత్యధికంగా భక్తులు ఇక్కడికి వచ్చారు. విడిది చేసేందుకు భక్తులకు లాడ్జీల్లో అద్దె గదులు దొరక్క చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లాడ్జీల ధరలు సైతం అమాంతంగా పెరగడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.2.50 లక్షల విరాళాలు :

రాఘవేంద్రస్వామి అంతరంగిక భక్తులు రూ.2.50 లక్షలు విరాళాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన అజ్ఞాత భక్తుడు రూ. 1.50 లక్షలు అన్నదానికి, రూ. 50 వేలు దైనందిన సేవలకు ఇచ్చారు. అనంతపురానికి చెందిన మరో భక్తులు రూ. 50 వేలు గోసంరక్షణకు విరాళంగా అందజేసినట్లు మేనేజర్–2 వెంకటేష్‌జోషి తెలిపారు.

ఎల్లెల్సీకి సాగునీరు విడుదల



కోసిగిలో నిండుగా ప్రవహిస్తున్న ఎల్లెల్సీ కాల్వ

కోసిగి: కోసిగి మండలంలోని ప్రవహిస్తున్న ఎల్లెల్సీ కాల్వకు సాగునీటిని విడుదల చేశారు. ఆదివారం కోసిగి సమీపంలో ప్రవహిస్తున్న ఎల్లెల్సీ కాల్వలో నిండుగా పుష్కలంగా సాగునీరు ప్రవహిస్తోంది. ఖరీఫ్‌లో ఎల్లెల్సీ కాల్వ కింద దాదాపు 7500 ఎకరాలు ఆయకట్టు భూములు సాగులోకి వస్తాయి. కాల్వ కింద ప్రత్తి, వేరుశనగ, ఉల్లి, మిరప పంటలు సాగుచేసుకుంటున్నారు. గతంలో కురిసిన వర్షాలకు ఇప్పటికే రైతులు పంటలు సాగుచేశారు. మరికొందరు కాల్వకు నీరు రావడంతో ఉల్లి నాట్లు వేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. కోసిగి మండలంలోని జుమ్మాలదిన్నె, వందగల్లు, కొల్మాన్‌పేట, దుద్ది, కోసిగి, దేవరబెట్ట, ఐరన్‌గల్లు గ్రామాల మీదుగా కాల్వ నిండుగా పారుతోంది. మండల ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం పాఠశాలలకు సెలవు దినం కావడంతో చిన్నారులు కాల్వలలో ఈత కొడుతూ ఆనందంగా గడిపారు.

'ఓపెన్' విద్య... సదవకాశం!

- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న సార్వత్రిక విద్యా పీఠం
- 31లోపు మీ సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- చదువుపై ఆసక్తి ఉన్నవారికి ఓ మంచి అవకాశం



పురపాలక ఉన్నత పాఠశాల

ఆదోని సెంట్రల్: చదువుకు దూరమై వివిధ కారణాల మూలంగా మధ్యలో చదువు మానేసిన వ్యక్తులకు సార్వత్రిక విద్యా పీఠం ద్వారా చదువుకునే సదవకాశం కల్పిస్తుంది ప్రభుత్వం. 2023–24 విద్యా సంవత్సరానికి పదవతరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ఆదోని పట్టణంలో పురపాలక ఉన్నత పాఠశాలలో సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ఓపెన్ స్కూలు ఏర్పాటు చేశారు. పదవ తరగతి ఫెల్ అయిన వ్యక్తులు, పదవతరగతి చదవగలమనే సామర్థ్యం కలిగి ఎటువంటి విద్యార్హతలు లేకపోయినప్పటికీ అవకాశం కల్పిస్తుంది. ఓపెన్ స్కూలు ద్వారా ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. బోధన విషయంలోనూ గ్రూపులుగా విభజించారు. స్వయంగా బోధన విషయాలు గ్రూపు ఏలో, భాషలు గ్రూపుబీలో, మెయిన్ సబ్జెక్టులను గ్రూపుసీలో వృత్తి విద్యాకోర్సులు ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

ప్రవేశాలు ఇలా

పదోతరగతి ప్రవేశాల కోసం జనరల్ అభ్యర్థులు(పురుషులు) రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, ఇంటర్‌కు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ప్రవేశ రుసుం జనరల్ అభ్యర్థులు(పురుషులు) రూ.1300 చెల్లించాలి. స్త్రీలు, ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్, ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలు మాత్రం రూ. 900 చెల్లించాలి. ఇంటర్ ప్రవేశ రుసుం జనరల్(పురుషులు) రూ.1400, స్త్రీలు, ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలు రూ.1100 చెల్లించాల్సి ఉంటుంది. మార్చి, ఏప్రిల్, జూలై ఆగస్టులో పబ్లిక్ పరీక్షలను నిర్వహిస్తారు. ప్రతి సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్స్ కలిగిన సబ్జెక్టుకు అదనంగా రూ.50 పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్ కలిగిన ప్రతి సబ్జెక్టుకు అదనంగా రూ.100 చెల్లించాలి. కోర్సు పూర్తి చేసుకునేందుకు అడ్మిషన్ పొందిన నాటి నుండి ఐదేళ్ల వరకు కాలపరిమితి ఉంటుంది. సంవత్సరానికి రెండుసార్లు పబ్లిక్ పరీక్షలను నిర్వహిస్తారు.

రెగ్యులర్ చదువుతో సమానం



ఓపెన్ స్కూల్‌లో విద్యనభ్యశించి ఉత్తీర్ణత సాధించిన విద్యార్హత రెగ్యులర్ చదువుతో సమానం. చదువు కోవాలని ఆసక్తి ఉండి అనివార్య కారాణాలతో మానేసిన వారికి మంచి అవకాశం. అంగనవాడీ టీచర్లు, ఆయాలు చేతి వృత్తుల వంటి వారికి మంచి అవకాశం. ప్రతి ఒక్కరూ చదువు కోవాలని సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ప్రభుత్వం విద్యను అందిస్తుంది.

– వెంకటేశులు, ఉపాధ్యాయుడు

సద్వినియోగం చేసుకోండి



ఓపెన్‌స్కూల్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. పదవతరగతి, ఇంటర్‌లో చేరదలిచిన అభ్యర్థులు మీసేవా కేంద్రంలో రిజిష్టర్ చేసుకోవాలి. పదవ తరగతికి అయితే టీసీ ఉండాలి. ఇంటర్‌కు పది ఉత్తీర్ణత సర్టిఫికెట్ ఉండాలి. ఆధార్ కార్డు, కులం, ఆదాయం సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్ ఫొటోలతో రిజిష్టర్ చేయించాలి. చదువులో వెనుక బడిన వారు, చదువుకోవాలని ఆశ కలిగిన వారికి మంచి అవకాశం.

– ఫయాజుద్దీన్, సహాయ కోఆర్డినేటర్, సార్వత్రిక విద్యాపీఠం

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్

కోడుమూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. ఆదివారం కోడుమూరులోని నాగార్జున విద్యానిలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 'గ్రామ స్వరాజ్యం – ప్రభుత్వం చర్యలు' అనే అంశంపై నియోజకవర్గంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేస్తామని చెప్పారు. అలాగే ఆగస్టు 15నుంచి కోడుమూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌సీ బీఈడీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నబి తదితరులున్నారు.

రైతుకు అస్వస్థత

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన హనుమంతు అనే రైతు పొలంలో ఎరువుల మందు పిచికారీ చేసి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వైద్య సిబ్బంది తెలిపిన వివరాల మేరకు ఆదివారం ఉదయం హనుమంతు సొంత పొలంలో పత్తి, మిరప పంటలకు ఎరువుల మందును పిచికారీ చేశాడు. సాయంత్రం ఇంటికి చేరాడు. అయితే రాత్రి భోజనం సమయంలో వాంతులతో తీవ్ర అస్వస్థతకు లోనైయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆ వ్యక్తిని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావడంతో స్టాఫ్ నర్స్ రాఘవేంద్ర ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో రైతును ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నైతిక విలువలు పెంపొందించాలి

కర్నూలు కల్చరల్: పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలు పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద అన్నారు. కర్నూలు వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళి భవన్‌లో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో బాల విహార్, భగవద్గీత తరగతులు జరిగాయి. ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కారం నేర్పాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇతిహాసాలు, పురాణాల్లోని అంశాలు వివరించాలన్నారు.